బతుకమ్మల నిమజ్జనం కోసం..

సొంత నిధులతో బేబీ పాండ్ నిర్మించిన గద్దె పద్మ



మైలార్‌దేవ్‌పల్లి: దసరా ఉత్సవాలలో భాగంగా బతుకమ్మలను మహిళలు భక్తి శ్రద్ధలతో పూజించి ఆట పాటలతో కలుషిత నీటిలో నిమజ్జనం చేస్తున్నారనే బాధతో ఓ మహిళ తాను దాచుకున్న డబ్బులతో కాలనీలో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు బేబీ పాండ్‌ను నిర్మించారు. వివరాలివీ... మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మార్కండేయ నగర్ కాలనీలో బతుకమ్మ సంబరాలను ఏటా మహిళలు ఘనంగా నిర్వహిస్తారు. ఆయా బతుకమ్మలు మురుగు నీటి చెరువులో నిమజ్జనం చేస్తుంటారు. అయితే కాలనీలోని గద్దె పద్మ అనే మహిళ తన సొంత నిధులు వెచ్చించి కాలనీవాసుల కోసం బేబీ పాండ్‌ను నిర్మించారు. ఈ సారి బతుకమ్మను మంచి నీటిలో నిమజ్జనం చేసేలా ఏర్పాట్లు చేశారు. తన సొంత నిధులతో బేబీ పాండ్‌ను నిర్మించిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పద్మను అభినందించారు.

పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ చూపాలి



బస్టాండ్‌లో వ్యర్థాలను శుభ్రం చేస్తున్న కార్మికులు

శంషాబాద్: ఏక్ దిన్.. ఏక్ ఘంటా ఏక్‌సాథ్ కార్యక్రమంలో భాగంగా శంషాబాద్ పట్టణంలో గురువారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు ఆధ్వర్యంలో వివిధ విభాగాలు పట్టణంలోని బస్టాండ్‌లో జరిగిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో పాల్గొని రహదారులు శుభ్రం చేయడంతో పాటు చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్మికులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కమిషనర్ సూచించారు. పట్టణ పరిశుభ్రతలో పౌరుల భాగస్వామ్యం కూడా తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బతుకమ్మ సంబురాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు.. నిర్వహణ ఇతరత్రా అంశాలపై గురువారం జీహెచ్‌ఎంసీ యూసీడీ విభాగం అధికారులు, సిబ్బందితో కమిషనర్ సురేందర్‌రెడ్డి సమీక్షించారు. ముఖ్య అతిథులను ఆహ్వానించడం, మహిళలకు పెద్ద ఎత్తున సంబరాలకు హాజరయ్యేలా చూడాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మహిళలకు ఇబ్బంది కలుగకుండా తగు ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... సర్కిల్ కార్యాలయ ఆవరణలో మధ్యాహ్నం 12.30 గంటలకు బతుకమ్మ సంబురాలను ప్రారంభిస్తామన్నారు. ప్రారంభోత్సవానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్లు హాజరవుతారన్నారు. ప్రాజెక్టు అధికారిణి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారుల్లో ఆక్రమణల పర్వం!

- ఫుట్‌పాత్‌లపై యథేచ్ఛగా వ్యాపారాలు
- కనిపించని సర్వీసు రోడ్లు
- పాదచారులు, వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారుల తీరుపై సర్వత్రా నిరసన





అత్తాపూర్ ప్రాంతంలోని కళాశాలల్లో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న మెట్ల దారులు



ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన దృశ్యం

అత్తాపూర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో ప్రధాన రహదారులు ఆక్రమణలకు గురవుతున్నాయి. యధారాజా తథా ప్రజా అనే చందంగా ఎవరికి వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన, అంతర్గత రహదారులతోపాటు ఫుట్‌పాత్‌లను సైతం వ్యాపారులు ఆక్రమించుకుంటూ తమ వ్యాపార కార్యకలాపాలను కొనసాగించుకుంటున్నారు.

- గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన పన్నులను చెల్లించడం లేదు. మొండి బకాయిలుగా రాని బాకీలుగా దుకాణ సముదాయాలు వారిపై కేసులు నమోదు చేస్తున్నా యజమానుల్లో ఎలాంటి స్పందన లేకపోవడం చర్చనీయంశంగా మారింది.
- అత్తాపూర్, హైదర్‌గూడ, బుద్వేల్, జనప్రియ, కాంతారెడ్డినగర్, అంబియన్స్ ఫోర్ట్, లక్ష్మీనగర్, సర్ధార్ వల్లభాయ్ పటేల్ చౌరస్తా, గోల్డెన్ ప్యాలెస్ హోటల్, ఎస్ఎంఆర్ గార్డెన్, హనుమాన్ టెంపుల్ పరిసర ప్రాంతాల్లో రోడ్లన్నీ ఆక్రమించుకున్నారు.
- ప్రధాన రహదారుల్లో వెలసిన కార్పొరేట్ జూనియర్ కాలేజీలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి విద్యా సంస్థలను నిర్వహిస్తున్నారు. ఒక్కో విద్యార్థి నుంచి లక్షలాది రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్న కళాశాల యజమాన్యాలు ఒకే గదిలో 100 నుంచి 120 మంది విద్యార్థులను కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు. కళాశాల నిర్వహణ కోసం విద్యార్థులు సులువుగా కళాశాలకు వెళ్లేందుకు కళాశాల యజమాన్యం రోడ్డును ఆక్రమించి మెట్ల దారి ఏర్పాటు చేసుకున్నారు. మరికొంత మంది దుకాణ సముదాయాన్ని ఆసరాగా చేసుకొని సర్వీస్ రోడ్డును ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేసుకున్నారు.
- ఇటీవల కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలో ప్రజల సౌకర్యార్థం ఉన్న ఫుట్‌పాత్‌లు, సర్వీస్ రోడ్లను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు పెనాల్టీ విధించి అక్రమ నిర్మాణాలు తొలగించిన విషయం తెలిసిందే.
- రాజేంద్రనగర్ మున్సిపాలిటీ పరిధిలో శివరాంపల్లి, పీడీపీ చౌరస్తా, ఉప్పర్‌పల్లి, ఎస్‌బీఆర్ గార్డెన్ నుంచి అత్తాపూర్ మూసీ బ్రిడ్జీ వరకు ప్రధాన రహదారి పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే ప్రధాన రహదారికి రోడ్డుకు ఇరువైపులా 10 కిలోమీటర్లు వరకు సర్వీస్ రోడ్డు ఫుట్‌పాత్‌లు కనిపించవు. ఈ ఆక్రమణలతో ఆ ప్రాంతాల్లో ప్రయాణిస్తున్న వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు సర్వీస్ రోడ్లపై వెలిసిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

దసరా ఉత్సవాలకు దేవాలయాల వద్ద పటిష్ట ఏర్పాట్లు



పల్లెచెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: దసరా ఉత్సవాలకు ఆయా దేవాలయాల వద్ద అభివృద్ధి పనులను నిర్వహిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాలరామకృష్ణ భక్త భజన మండలి ఉమ్మడి దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి దసరా ఉత్సవాల కార్యక్రమాల కోసం మౌలిక వసతులు, వీధి దీపాలు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు ప్యాచ్ వర్క్ పరిసరాల పరిశుభ్రత కోసం టెంపరరీ లైన్ ఫిట్టింగ్స్ దేవాలయాల నుంచి పల్లెచెరువు హైవే రోడ్డు దారి ఇరువైపులా ఒకరోజు ముందు నుంచి ఏర్పాట్లు చేయాలని సూచించారు. బతుకమ్మలు వేయడానికి నీటి కొలను ఏర్పాట్లు పనులపై జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యావేక్షించడం జరుగుతుందన్నారు. దసరా రోజు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దేవాలయ కమిటీ సభ్యులు, అధ్యక్షుడు కృష్ణయాదవ్, కాశమౌని అనిల్‌ముదిరాజ్, రావుల భాస్కర్, ప్రతాప్‌రెడ్డి, దేవులపల్లి దాసు, గజ్జల సురేష్‌ముదిరాజ్, వెంకట్‌రెడ్డి, దేవేందర్‌గౌడ్, రావుల రాజు, బీజేపీ నాయకులు, డివిజన్ ప్రెసిడెంట్ పాండుయాదవ్, తలారి చిన్న శంకర్‌రెడ్డి, ఏఈ నర్సింహ్మామూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, సురేందర్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి



పాఠశాల ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాల్లో మొక్కలను నాటడంతోపాటు ప్రతి మొక్కనూ సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా పార్టీ డివిజన్ అధ్యక్షుడు గోదా పాండుయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా వెంకటేశ్వర కాలనీ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మాజీ అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ హైందవ రాష్ట్ర సిద్ధాంతకర్త పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ మొదటి కొద్ది మంది స్వయం సేవకులలో ఒకరిగా చేరి ప్రాదేశిక సహ ప్రచారక్ స్థాయికి ఎదిగారన్నారు. భారతీయ జన సంఘ్‌కు సిద్ధాంతాలు లేవన్న వారి నోర్లు మూయించడానికి ఏకత్వాతా మానవతా వాదం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడన్నారు. అట్టడుగున పడి ఉన్న మానవుడు ఐహిక సుఖంతో వర్ధిల్లి, ఆధ్యాత్మిక దృష్టితో మానవ సేవ చేయడమే సరైన జీవిత విధానమని అందులో వాదించాడన్నారు. ప్రతి మానవుడి శరీరం, మనస్సు, తెలివితేటలు, ఆత్మ యొక్క ఏకకాల సమగ్ర కార్యక్రమాన్ని సూచించే సమగ్ర మానవతా వాదం అనే రాజకీయ తత్వాన్ని దీన్ దయాల్ ఉపాధ్యాయ రూపొందించారని గుర్తు చేశారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, తలారి చిన్న, జగన్, రామారావు, ఆదిమూల శేఖర్, ప్రభుదాస్, దినకర్, భాను, రాంబాబు, ప్రకాష్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎకో పార్కు వ్యూపాయింట్‌లో వ్యర్థాల డంపింగ్



ఎకో పార్కు సమీపంలో గుంతల్లో అక్రమంగా చేపడుతున్న డంపింగ్

శంషాబాద్: కొత్వాల్‌గూడ ఎకో పార్కు వ్యూపాయింట్‌లో భారీ ఎత్తున నిర్మాణ ఇతర వ్యర్థాలను అక్రమంగా డంపింగ్ చేస్తున్నరు. శంషాబద్ పట్టణంలోని కొత్వాల్‌గూడ, హిమాయత్‌సాగర్ వరకు కొనసాగుతున్న రహదారి పనుల్లో కాంట్రాక్టర్లు స్థానికంగా చదును చేపడుతున్న చోట ఉన్న మట్టిని, బండరాళ్లను దూరం తీసుకెళ్లకుండా ఎకో పార్కుకు సంబంధించిన గోతుల్లోనే పడేస్తున్నారు. గతంలో కొత్వాల్‌గూడ క్వారీలతో ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలను ఎకో పార్కు నిర్మాణంలో భాగంగా అలాగే వదిలేసి దానిని వ్యూపాయింట్‌గా వాడుకోవాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు చేపట్టిన పార్కు నిర్మాణంలో అక్కడ నుంచి తొలగించిన బండరాళ్లు, మట్టిని సైతం దూర ప్రాంతాలకు తీసుకెళ్లి పడేశారు. కానీ ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు స్థానికంగా తీస్తున్న బండరాళ్లు, మట్టిని తీసుకొచ్చిన దగ్గరలోనే ఉన్న గుంతల్లో పడేసి చేతులు దులుపుకొంటున్నారు. అధికారికంగా ఎలాంటి అనుమతలు లేకుండా కాంట్రాక్టర్లు, లారీల నిర్వాహకులు చేపడుతున్న డంపింగ్‌ను హెచ్ఎండీఏ అధికారులు అడ్డుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తామని ప్రతిజ్ఞ



పరిశుభ్రతపై ఎంజీ పార్కులో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్

మణికొండ: మన కాలనీలు, పరిసరాలు, పార్కులు పరిశుభ్రంగా ఉన్నపుడే మనమంతా ఆరోగ్యంగా, ఆహ్లాదంగా జీవించ గలుగుతామని, అందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా తీసుకున్నపుడే అది సాధ్యమని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ అన్నారు. అలకాపూర్ టౌన్‌షిప్‌లోని ఎంజీ పార్కులో గురువారం ఆయన స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా పార్కులో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో ఆహ్లాదకర పార్కులు ఉన్నాయని, వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ పార్కులో మరుగుదొడ్లు, మహిళలకు మూత్ర శాలలు నిర్మించాలని కోరారు. స్పందించిన కమిషనర్ త్వరలోనే వాటిని నిర్మించి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తామని వాకర్స్, స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఎం.జితేందర్, ఆల్ కాలనీస్ ఫెడరేషన్, అలకాపూర్ అధ్యక్షుడు ఎ.వంశీ, కోశాధికారి రవీందర్‌రెడ్డి వాకర్స్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ప్రీమియం థియేటర్లకు ఆదరణ

సినీ పరిశ్రమాభివృద్ధి, టీవీ, థియేటర్స్ అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు



మిరాజ్ సినిమాస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న దిల్‌రాజు, ఆర్.నారాయణమూర్తి తదితరులు

మణికొండ: హైదరాబాద్ నగరంతో పాటు శివార్లలో వస్తున్న ప్రీమియం థియేటర్లను ప్రజలు ఆదరిస్తున్నారని సినీ పరిశ్రమాభివృద్ధి, టీవీ, థియేటర్స్ అభివృద్ధి సంస్థ చైర్మన్, సినీ నిర్మాత, పంపిణీదారు దిల్‌రాజు అన్నారు. హైదరాబాద్ నగర శివారు నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో నాలుగు అత్యాధునిక డాల్బీ డిజిటల్ స్క్రీన్లు, 801 సీటింగ్ సామర్థ్యంతో నిర్మించిన మిరాజ్ సినిమాస్, ఆనంద మాల్, మూవీస్‌ను గురువారం దర్శకుడు, నిర్మాత, నటుడు ఆర్.నారాయణమూర్తి, మైహోం గ్రూప్ చైర్మన్ జె.రామేశ్వర్‌రావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నార్సింగి ప్రాంతం ఆధునిక జీవనశైలికి కేంద్రంగా ఎదుగుతోందని, ఈ ప్రాంతానికి ఆనంద్ మాల్, మూవీస్ సంస్థ మిరాజ్ సినిమాస్ రావటంతో ల్యాండ్ మార్క్‌గా నిలుస్తుందన్నారు. వినోదం అంటే కేవలం సినిమా మాత్రమే కాదని, ఆనందాలు పంచుకునేందుకు మల్టీప్లెక్స్‌ల వల్ల అంతర్జాతీయ స్థాయి టెక్నాలజీ, కంఫర్ట్‌లు లభిస్తాయన్నారు. రఘురాం గ్రూప్ ఎండీ డాక్టర్ ఆనందరావు మాట్లాడుతూ... షాపింగ్, వినోదం, సరదాగా కాలం గడిపే ప్రదేశంగా అన్నీ ఒకే చోట ఉండాలనే ఆనంద్‌మాల్, మూవీస్‌ను ఏర్పాటు చేశామన్నారు.

ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



మైలార్‌దేవ్‌పల్లి: పండగలను ప్రజలంతా ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సూచించారు. దసరా ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ దేవాలయ కమిటీ సభ్యులు గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. తప్పకుండా ఉత్సవాల్లో పాల్గొంటానని ఆయన వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నేతలు మునగపాటి చంద్రయ్య, పులిజాల వివేక్, మునగపాటి వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-25

శంషాబాద్ రూరల్: ఆరోగ్య సంరక్షణ, విద్యలో ఏఐ ఆవిష్కరణల ప్రాముఖ్యతకు ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులు ఆ దిశగా ఆలోచనతో సవాళ్లను ఎదుర్కోవాలని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీఆర్ రవీంద్ర అన్నారు. మండలంలోని కాచారం శివారులో ఉన్న కళాశాలలో నిర్వ హించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్: 2025 - ఇంటర్నల్ హ్యాకథాన్ ముగింపు కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఆవిష్కరణ, టీం కృషి, వాస్తవ ప్రపంచ సమస్య పరిష్కార ం ప్రాముఖ్యతను వివరించారు. వివిధ విభాగాల నుంచి 263 విద్యార్థి బృందాలు హ్యాకథాన్‌లో పాల్గొనగా.. 50 ప్రతిభావంతులైన జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు ఎస్ఐహెచ్ గ్రాండ్ ఫినాలే నేషనల్ స్థాయిలో వర్ధమాన్ తరపున ప్రాతినిధ్యం వహిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కళాశా ల విద్యార్థుల ఆవిష్కరణలు, సృజనాత్మకత మరి యు సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడంలో మరో ఘనమైన మైలురాయిగా నిలుస్తుందని అభివర్ణించారు. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రమేష్ కర్నాటి, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు డాక్ట ర్ సి.పద్మిని, డాక్టర్ పి.వెంకటేశ్వర్‌రెడ్డి, డాక్టర్ గగన్‌దీప్ ఆరోరా పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో జీవీసీ, రిచ్, జేపీ మోర్గాన్ ప్రతినిధులతో పాటు ఎస్ఐహెచ్ పూర్వ విజేతలు వి.దత్తాసాయి తనూజ్, అమృంతాషు కుమార్ వర్మ, అక్షిత్‌రెడ్డి, డాక్టర్ ఝాన్సీలక్ష్మీ, అలియా నూర్జైన్, నీరజ, సాయి కరణ్మయి, ఎం.యశ్వంత్, ఎండీ సోహెల్‌ఖాన్, అభిషేక్‌గౌడ్, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం తథ్యం

- సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలం
- బీఆర్‌ఎస్ శ్రేణులు పాలకులను నిలదీయాలి
- మాజీ మంత్రి సబితారెడ్డి



బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన యువకులతో మాజీ మంత్రి సబితారెడ్డి

మణికొండ: రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ పటిష్టంగా ఉందని, కొన్ని నియోజకవర్గాలలో కొందరు ఎమ్మెల్యేలు, నాయకులు పార్టీ మారినా కేడర్, ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని, రాబోయే రోజుల్లో తిరిగి అధికారం ఇచ్చి పూర్వ వైభవానికి తెచ్చేందుకు వారంతా సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి. సీతారాం ఆధ్వర్యంలో కొందరు యువకులు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి, సబితారెడ్డిల సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో సబితారెడ్డి మాట్లాడుతూ... రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రంగాల వారిని పార్టీలో చేర్చుకోవాలన్నారు. ప్రజలకు ఎదురవుతున్న సమస్యలు, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం అమలు చేయటం లేదన్నారు. వాటిని ప్రజల్లోకి తీసుకుని వెళ్లి కాంగ్రెస్ నాయకులను నిలదీయాలన్నారు. పింఛన్‌ల పెంపు, కల్యాణలక్ష్మి నిధులతో పాటు తులం బంగారం, బీసీ రిజర్వేషన్లు, దసరాకు మహిళలకు ఉచితంగా ఇచ్చే చీరల విషయంలో వారిని నిలదీయాలన్నారు. పార్టీలో చేరిన దీపక్‌సింగ్, నరేష్, నగేస్, షేక్ ఖదీర్, అఖిలకు ఆమె కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. పార్టీ మణికొండ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ధన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, నాయకులు రాజేంద్రప్రసాద్, విజయలక్ష్మి, భానుచందర్, జి.విఠల్, సుమ నళిని, సుమన్, దస్తగిరి, శ్రీశైలం, కె.ప్రవీణ్, మోనేష్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత పండిత్ దీన్ దయాళ్



హైదర్‌గూడ చౌరస్తాలో దీన్ దయాల్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



మైలార్‌దేవ్‌పల్లి మధుబన్ కాలనీలో...



నార్సింగిలో...



మణికొండలో...

అత్తాపూర్/మైలార్‌దేవ్‌పల్లి/మణికొండ: భారతీయ జనసంఘ్‌కు మార్గదర్శకుడు పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ సేవలు చిరస్మరణీయమని పలువురు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. దీన్ దయాళ్ జయంతిని రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ... మానవతావాదం.. సిద్ధాంతం దేశానికి, పార్టీకి ఎప్పటికీ ప్రేరణగా నిలుస్తాయన్నారు. దీన్‌దయాళ్ ఆలోచన విధానాలతో బీజేపీ బలపడిందన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



శివరాంపల్లి గ్రామంలో...

కాత్యాయినీ నమోస్తుతే..



కాత్యాయినిగా కోట మైసమ్మ



శంషాబాద్ ధర్మగిరిలో కాత్యాయినిగా దర్శనమిచ్చిన అమ్మవారు



మణికొండ ఓయూ కాలనీలో కాత్యాయినిగా దుర్గామాత



టీఎన్‌జీవోస్ కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మీదేవిగా...



హైదర్‌గూడ పోచమ్మ దేవాలయంలో...

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వాడవాడలా వెలసిన దుర్గాదేవి భక్తులకు రోజుకో అలంకరణలో దర్శనం ఇస్తున్నారు. దసరా సంబురాల్లో భాగంగా గురువారం దుర్గాదేవి కాత్యాయినిగా దర్శనం ఇచ్చారు.

– రాజేంద్రనగర్ జోన్ బృందం



నార్సింగిలో పూజల్లో పాల్గొన్న మాజీ కౌన్సిలర్లు, భక్తులు



బండ్లగూడ కిస్మత్‌పూర్‌లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



బుద్వేల్ దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మైలార్‌దేవ్‌పల్లి లక్ష్మీగూడలో బీసీ మోర్చా రాష్ట్ర నేత అడికే రాజు



మణికొండ శివాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మణికొండలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు